క్లుప్తంగా

చెంఘీజ్‌ఖాన్‌పేట ఆలయ భూములకు కౌలువేలం

15.24 ఎకరాలకు రూ.2.89 కౌలు వేలం

యడ్లపాడు: చారిత్రక ప్రాంతమైన చెంఘీజ్‌ఖాన్ పేట గ్రామంలో వేంచేసి ఉన్న పురాతన ఆలయమైన శ్రీ వెన్నముద్దల వేణుగోపాల స్వామి దేవస్థానంకు చెందిన భూములకు అధికారులు కౌలుహక్కు వేలంపాట నిర్వహించారు. సోమవారం సాయంత్రం ఆలయం ప్రాంగణంలో ఏర్పాటు చేసిన బహిరంగ కౌలు వేలం పాట స్థానిక రైతులు పోటీపడ్డారు. 15.24 ఎకరాలకు గతంలో రూ.84,500 కౌలు వేలం నిర్వహించగా తాజా వేలంలో అనూహ్యంగా పెరిగి రూ.2,89,000కు చేరింది. రాష్ట్ర ఉన్నత న్యాయ స్థానం తీర్పు ఆదేశానుసారంగా ఆలయ అర్చకులు సమక్షంలో ఈ వేలం పాట నిర్వహించినట్లు ఆలయ కార్యనిర్వహణ అధికారి చెన్నుపల్లి శివయ్య తెలిపారు.

వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు


మల్లికార్జునరావు (ఫైల్)

యడ్లపాడు: వ్యక్తి అదృశ్యమైన కేసు యడ్లపాడు పోలీస్ స్టేషన్‌లో సోమవారం నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని లింగారావుపాలెం గ్రామానికి చెందిన మల్నేని మల్లికార్జునరావు 2022 అక్టోబర్ ఒకటో తేదీన వ్యక్తిగత పనులపై విజయవాడకు వెళ్లి తిరిగి రాలేదు. ఆయన భార్య సీతామహాలక్ష్మి 1995లోనే మృతి చెందగా, మల్లికార్జున రావుకు తలకు గతంలో ఓ సర్జరీ చేయడంతో జ్ఞాపక శక్తి కొద్దిగా మందగించింది. ఉద్యోగ రీత్యా అమెరికాలో స్థిరపడిన ఆయన పెద్దకుమారుడు మల్నేని రమేష్‌బాబు తండ్రి కనిపించలేదన్న విషయం తెలిసి వీసా సమస్యలతో ఇండియాకు రాలేకపోవడంతో నాటి నుంచి బంధుమిత్రులతో వెతికించడం చేసినా ఫలితం లేకుండా పోయింది. ప్రస్తుతం స్వగ్రామానికి వచ్చిన ఎన్నారై రమేష్ బాబు తన తండ్రి ఆచూకీ కనుగొని తమకు న్యాయం చేయాలంటూ సోమవారం రమేష్ బాబు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. యడ్లపాడు ఎస్‌ఐ జె.శామ్యూల్ రాజీవ్ కుమార్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

స్టూడెంట్ కిట్స్ పంపిణీ



దొడ్లేరు(క్రోసూరు): మండలంలోని దొడ్లేరు గ్రామంలో ఎంపీపీఎస్ (ఎస్సీ) పాఠశాలలో నేనుబడికి పోతా కార్యక్రమంలో భాగంగా సోమ వారం స్టూడెంట్ కిట్స్ అందజేసినట్లు పాఠశాల హెచ్‌ఎం ఐ.సామ్రాజ్యం తెలిపారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మాట్లాడుతూ విద్యార్థులు ప్రభుత్వం అందించే కిట్స్ సద్వినియోగపరుచుకుని మంచి చదువులు చదువుకోవాలన్నారు. ప్రతిఒక్క విద్యార్థి తప్పనిసరిగా క్రమం తప్పకుండా బడికి రావాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు జి.సదాశివారెడ్డి, టి.ప్రకాశరావు, గ్రామ సర్పంచ్ ముక్కు అంజలి, గోపి, గ్రామపెద్దలు చంద్రశేఖరరావు, సైదా, చెత్తు బుడే, మొగల్‌జాన్, విష్ణుమూర్తి, కె.సుబ్బారావు, చిన శాంతయ్య తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్రగాయాలు



తెనాలిరూరల్: ఆటో రైల్వే వంతెన గడ్డర్‌ను ఢీకొట్టడంతో ఓ వ్యక్తికి తీవ్రగాయాలవ్వగా మరో నలుగురు స్వల్పంగా గాయపడ్డారు. వివరాలిలా ఉన్నాయి. బాపట్ల జిల్లా వేమూరు మండలం పెరవలి నుంచి సోమవారం తెనాలి వస్తున్న ప్రయాణికుల ఆటో పట్టణ వైకుంఠపురం సమీపంలోని రైల్వే బ్రిడ్జి ఇనుప గడ్డర్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో పెరవలిపాలెంకు చెందిన కంచె సాంబశివరావుకు తీవ్ర గాయాలు కావడంతో 108 ద్వారా ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అదే ఆటోలో మరో నలుగురు ప్రయాణికులు స్వల్పంగా గాయపడ్డారు. బ్రేక్ ఫెయిల్ అయిన కారణంగా ప్రమాదం జరిగినట్టు ఆటోడ్రైవర్ చెబుతున్నాడు. త్రీ టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వైభవంగా ముత్యాలమ్మ జాతర

తుమ్మకోట(రెంటచింతల): మండలంలోని తుమ్మకోట గ్రామంలో ఇంద్రపల్లి ముత్యాలమ్మ జాతర మహోత్సవ వేడుకలు సోమవారం ఆలయ అర్చకులు సాయికృష్ణ నేతృత్వంలో ఎంతో వైభంగా కొనసాగుతున్నాయి. గ్రామ దేవత ఇంద్రపల్లి అమ్మవారికి పూర్వం నుంచి ఒక ఆచారంగా రెండు సంవత్సరాలకు ఒకసారి ముత్యాలమ్మ జాతరకు కులమతాలకు అతీతంగా గ్రామంలోని అన్ని వర్గాల ప్రజలు తమ తమ మొక్కులు చెల్లించుకుంటారు. ఆలయాన్ని రంగురంగుల విద్యుత్ దీపాలతో అందంగా ముస్తాబు చేసి అలంకరించారు. జాతర ప్రశాంతంగా నిర్వహించడానికి ఎస్‌ఐ ఎం.ఆంజనేయులు తన సిబ్బందితో బందోబస్తును ఏర్పాటు చేసి పర్యవేక్షించారు.

వైభవంగా కోదండ రామాలయ తొలి వార్షికోత్సవం


కల్యాణమూర్తులుగా స్వామివార్లు


గణపవరం హోమంలో పాల్గొన్న భక్తులు

గణపవరంలో మార్మోగిన శ్రీరామనామం

నాదెండ్ల: గణపవరం గ్రామంలో రూ.2 కోట్ల వ్యయంతో పూర్తి రాతితో నిర్మించిన శ్రీ కోదండ రామాలయం తొలి వార్షికోత్సవం సోమవారం ఘనంగా జరిగింది. ఆలయ ప్రధాన పూజారులు దర్భి ఉమామహేశ్వర శర్మ, అనిల్‌కుమార్ శర్మలు స్వామివార్లను పట్టు వస్త్రాలతో అలంకరించి అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. గ్రామంలో సుమారు రెండు శతాబ్దాల క్రితం నిర్మించిన కోదండ రామాలయం శిథిలావస్థకు చేరడంతో, 2015లో దీని స్థానంలో గ్రామస్తులు నూతన ఆలయం నిర్మించారు. 2023 జూన్ 7న త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చినజీయర్ స్వామిచే విగ్రహం, జీవ ధ్వజస్తంభ ప్రతిష్ట నిర్వహించారు.

సోమవారం ఉదయం యాగశాలలో శాంతి హోమాలు నిర్వహించారు. ఉదయం ఆలయ శుద్ధి, అనంతరం స్వామివార్లను పట్టు వస్త్రాలతో అలంకరించి అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. సాయంత్రం స్వామివారికి కల్యాణ మహోత్సవం జరిగింది. భారీ ఎత్తున అన్నదాన కార్యక్రమం నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు. గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. ప్రతి ఇల్లు బంధువులతో కళకళలాడింది.

ప్రత్యేక పూజల్లో ప్రముఖులు

ఆలయ తొలి వార్షికోత్సవానికి శ్రీ త్రిదండి చిన్నజీయర్ స్వామిశిష్యులైన గుదిమెళ్ళ శ్రీ కూర్మనాథ స్వామి, భారతీ ధార్మిక విజ్ఞాన పరిషత్ అధ్యక్షుడు బొల్లేపల్లి సత్యనారాయణ, ధనలక్ష్మీ గ్రూపు సంస్థల కార్యదర్శిపేర్ని వీరనారాయణ, ఎంఎల్ అండ్ కో కంపెనీ డైరెక్టర్ మద్ది వెంకటేశ్వరరావు, సీఆర్ కళాశాల పాలక మండలి అధ్యక్షుడు చుండి విజయసారధి, కేతినేని శ్రీహరి రావు, ఆలయ కమిటీ చైర్మన్, సభ్యులు ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు.

దేవాలయ భూములకు కౌలు వేలం నిర్వహించాలి

డీఈవోకు అప్పాపురం రైతుల వినతి

నాదెండ్ల: దేవదాయశాఖ ఆధీనంలో ఉన్న సాగుభూములకు త్వరలో బహిరంగ వేలం నిర్వహించి రైతులకు అందజేయాలని అప్పాపురం గ్రామానికి చెందిన పలువురు రైతులు గుంటూరులోని దేవదాయశాఖ డీఈవోకు వినతిపత్రం అందించారు. అప్పాపురం గ్రామ పరిధిలోని అంకమ్మతల్లి దేవస్థానం ఆధీనంలోని సర్వే నెం.1423లో 9.54 సెంట్లు, ప్రసన్నాంజనేయ స్వామి దేవస్థానం ఆధీనంలోని సర్వే నెం.447లో 12.54 సెంట్లు, శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి దేవస్థానం ఆధీనంలోని అప్పాపురం, నాదెండ్ల గ్రామాల్లోని పలు సర్వే నెంబర్లలో సుమారు 30 ఎకరాల పైబడిన భూములున్నాయని, త్వరలో బహిరంగ వేలం నిర్వహించి భూములు పంపిణీ చేయాలన్నారు.

దీనివలన దేవదాయ శాఖకు మంచి ఆదాయం సమకూరుతుందన్నారు. కొందరు రైతులు అంకమ్మతల్లి దేవస్థానానికి చెందిన భూములను వారి స్వాధీనం చేసుకున్నారని ఫిర్యాదు చేశారు. దీనిపై డీఈవో మాట్లాడుతూ, దేవాలయ భూములు దున్నిన రైతులకు నోటీసులు అందిస్తామని, భూములకు త్వరలో బహిరంగ కౌలు వేలం నిర్వహిస్తామని తెలిపారు.

కౌలు రైతులందరికీ రుణ అర్హత కార్డులు

మండల వ్యవసాయ అధికారి రామినేని రామారావు

శావల్యాపురం: అర్హత కల్గియున్న కౌలు రైతులందరికీ రుణ అర్హత కార్డులు మంజూరు చేస్తామని మండల వ్యవసాయ అధికారి రామినేని రామారావు తెలిపారు. సోమవారం స్థానిక రైతుభరోసా కేంద్రంలో ఏవో మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనలు మేరకు రెండున్నర ఎకరాలు సాగు భూమి కల్గి రైతులు భూమి యజమాని అంగీకారంతో ఎకరం భూమి కౌలుకు ఇస్తే ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాల చెందిన రైతుకు ఎన్టీఆర్ రైతుభరోసా రూ.20 వేలు వర్తించేలా చర్యలు తీసుకుంటామన్నారు. శావల్యాపురం మండలం–1890, ఈపూరు మండలం–2362, నూజెండ్ల–2600, బొల్లాపల్లి–2481, వినుకొండ రూరల్ మండలం–2481 మంది కౌలు రైతులకు రుణ అర్హత కార్డులు అందజేయడానికి లక్ష్యంగా ఎంచుకున్నట్లు తెలిపారు. ప్రభుత్వ నిబంధనల మేరకు రుణ అర్హత కార్డులు కల్గి కౌలు రైతులకు బ్యాంకు రుణాలుతో పాటు రాయితీపై విత్తనాలు ఎరువులు కూడా అందజేస్తామన్నారు. అన్నీ రైతుభరోసా కేంద్రాల్లో రైతులకు అవసరమైన ఎరువులు అందుబాటులో ఉన్నాయన్నారు. విత్తనాలు కొనుగోలు చేయు సమయంలో రైతులు వ్యాపారస్తుల నుంచి తప్పనిసరిగా బిల్లులు తీసుకోవాలన్నారు. ఏఈవో పురేటి అశోక, వీఏఏ వెంకాయమ్మ తదితరులు ఉన్నారు.

ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి

సూచించిన వ్యవసాయాధికారి శివ లలిత


మాట్లాడుతున్న వ్యవసాయాధికారి శివలలిత

రొంపిచర్ల: ప్రతి కౌలు రైతు విలేజ్ రెవెన్యూ అధికారి లాగిన్‌లో తమ దరఖాస్తులను ఆన్‌లైన్‌లో పంపించాలని వ్యవసాయాధికారి శివలలిత కోరారు. సోమవారం మండలంలోని కర్లకుంట, తురిమెళ్ల గ్రామాల్లో రెవెన్యూ, వ్యవసాయ శాఖల సంయుక్త ఆధ్వర్యంలో కౌలు రైతుల అవగాహన సదస్సులు నిర్వహించారు. మండల వ్యవసాయ శాఖ అధికారి శివ లలిత మాట్లాడుతూ సీసీఆర్సీ కార్డుల కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునే విధానాన్ని వివరించారు. దరఖాస్తుపై భూయజమానితో పాటు కౌలురైతు సంతకం తప్పనిసరిగా ఉండాలన్నారు. భూ యజమాని అంగీకారంతోనే కౌలురైతు దరఖాస్తును ఆన్‌లైన్ చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్డుల వల్ల వ్యవసాయ శాఖ తరఫున రైతులకు రాయితీపై వచ్చే విత్తనాలతో పాటు ఈ పంట నమోదు పంట నష్టం జరిగినప్పుడు నష్టపరిహారం మద్దతు ధరకు పంట దిగుబడులను కొనుగోలు చేయటం జరుగుతుందన్నారు. అలాగే అర్హత ఉన్న ప్రతి కౌలురైతుకు క్రాప్ ఇన్సూరెన్స్ తదితర ప్రయోజనాలు ఈ కార్డుల వల్ల ప్రయోజనాలు చేకూరతాయన్నారు. ఈ అవకాశాన్ని ప్రతి కౌలు రైతు సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు. ఈ సదస్సులో డిప్యూటీ తహసీల్దార్ సుబ్బారావు, రెవెన్యూ అధికారి షేక్ జిలాని, ఆయా గ్రామాల వీఏఏలు, వీఆర్వోలు పలువురు కౌలు రైతులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శులకు డీడీవో అధికారాలపై హర్షం

నాదెండ్ల: గ్రేడ్–5 పంచాయతీ కార్యదర్శులకు ప్రభుత్వం డీడీవో అధికారాలు కల్పించటంపై పంచాయతీ కార్యదర్శుల సంఘం సోమవారం హర్షం వ్యక్తం చేసింది. ఈ మేరకు జిల్లా కలెక్టర్ నుంచి ఉత్తర్వులు జారీ అయ్యాయి. గాంధీజీ కలలుగన్న గ్రామ స్వరాజ్యాన్ని సాధించే లక్ష్యంగా ఈ జీవోతో ప్రభుత్వానికి మంచి పేరు వస్తుందన్నారు. ఇందుకు సంబంధించిన పంచాయతీ అండ్ గ్రామీణాభివృద్ధి శాఖా మంత్రి పవన్ కల్యాణ్‌కు ధన్యవాదాలు తెలిపారు. హర్షం వ్యక్తం చేసిన వారిలో సాతులూరుకు చెందిన ఏపీ రాష్ట్ర పంచాయతీ కార్యదర్శుల సంఘం అధ్యక్షుడు ఎం.రమేష్‌బాబు తెలిపారు.

గ్యాస్ వినియోగదారులు ఈకేవైసీ చేయించుకోవాలి

వినుకొండ(నూజెండ్ల): కేంద్ర పెట్రోలియం మంత్రిత్వ శాఖ ఉత్తర్వుల ప్రకారం హెచ్‌పీ గ్యాస్ వినియోగదారులు కచ్చితంగా ఈకేవైసీ, సేఫ్టీ చెకప్ చేయించుకోవాలని వినుకొండ హెచ్‌పీ గ్యాస్ డిస్ట్రిబ్యూటర్ సయ్యద్ సలీం తెలిపారు. 5 సంవత్సరాల పైబడి కాలం చెల్లిన సురక్ష పైపులను ఏజెన్సీ సిబ్బంది వద్ద మార్చుకోవాలని సూచించారు. ఈకేవైసీకి రుసుము చెల్లించాల్సిన అవసరంలేదని, సురక్ష పైపుకు రూ.190లు చెల్లించాలన్నారు.

పంచాయతీ కార్యదర్శులుగా గ్రేడ్–5 కార్యదర్శులు

క్రోసూరు: మండలంలో గ్రామ సచివాలయాల్లో గ్రేడ్–5 కార్యదర్శులుగా పనిచేస్తున్న ఐదుగురు కార్యదర్శులకు సోమవారం నుంచి పూర్తిస్థాయి పంచాయతీ కార్యదర్శులుగా బాధ్యతలు అప్పగించినట్లు పంచాయతీ విస్తరణాధికారి పి.శివరామయ్య తెలిపారు. మండలంలోని గరికపాడు గ్రామ పంచాయతీ కార్యదర్శిగా ఎ.శేషగిరి, గాదెవారిపాలెం పంచాయతీ కార్యదర్శిగా ఒ.లక్ష్మీప్రసన్న, ఉయ్యందన పంచాయతీ కార్యదర్శిగా ఉమాశంకర్, విప్పర్ల గ్రామ పంచాయతీ కార్యదర్శిగా ఒ.ప్రకాశ్, బాలెమర్రు పంచాయతీ కార్యదర్శిగా ఎస్.హరరికృష్ణ బాధ్యతలు తీసుకున్నట్లు తెలిపారు. మరో ముగ్గురు గ్రేడ్–5 కార్యదర్శులకు త్వరలో పూర్తిస్థాయి కార్యదర్శుల బాధ్యతలు అప్పగించనున్నట్లు ఈవోపీఆర్డీ తెలిపారు.

ఘాటెక్కుతున్న ఉల్లి

- ఉత్పత్తి తగ్గుదల
- ప్రస్తుతం కిలో ఉల్లి ధర రూ.40
- మరింత పెరగనున్న ఉల్లి ధరలు
- కొనాలంటే కన్నీళ్లు తప్పవంటున్న వినియోగదారులు

ఉల్లి చేసిన మేలు తల్లి కూడా చేయదంటారు. కానీ ప్రస్తుత పరిస్థితుల్లో ఉల్లి నుంచి ఆ మేలు పొందే సంగతి అటుంచితే దాని మాట ఎత్తాలంటేనే భయమేస్తుంది. ఇందుకు కారణం ధరలు. పెరుగుతున్న ధరలతో కళ్లల్లో నీళ్లు తిరగడమే! పేద, మధ్యతరగతి వర్గీయుల వంటకాల్లో ప్రధాన అవసరమైనది ఉల్లిపాయలే. ఇది లేనిదే ముద్ద దిగని వ్యక్తులు మనకు తారసపడతారు. అలాంటి ఉల్లిపాయల ధరలు నేడు కొండెక్కి కూర్చున్నాయి. కొనాలంటే భయపడే స్థాయికి చేరుకున్నాయి.


విక్రయానికి దుకాణంలో సిద్ధంగా ఉన్న ఉల్లిపాయలు

సత్తెనపల్లి: ఉల్లిపాయల ధరలకు రెక్కలొచ్చాయి. మే నెలలో రూ.20 ఉన్న ధర జూన్‌లో రెట్టింపై రూ.40కి చేరింది. పూణే, ఢిల్లీ, హైదరాబాద్, కర్నూల్ నుంచి జిల్లాలోని మార్కెట్లకు ఉల్లిపాయ లు (ఎర్రగడ్డలు) వస్తున్నాయి. జిల్లాలో తగినంత నిల్వలు లేకపోవడం, సరఫరా మందగించడంతో ధరలు పెరుగుతున్నాయని వ్యాపారులు చెబుతున్నారు. దేశంలో ఉల్లిని ఉత్పత్తి చేసే అగ్రగామి రాష్ట్రమైన మహారాష్ట్రలో కరువు పరిస్థితుల కారణంగా ఉత్పత్తి లోటు ఉంది. దీంతో దేశంలో గత రెండు వారాల్లో ఉల్లి ధరలు 30 నుంచి 50 శాతం పెరిగాయి. ఈ క్రమంలోనే కొందరు వ్యాపారులు సరుకు నిల్వ చేసి ధరలు మరింతగా పెరిగేలా చేస్తున్నారనే ఆరోపణలు మార్కెట్ వర్గాల్లో వినిపిస్తున్నాయి. ఈ క్రమంలో ధరల నియంత్రణకు కేంద్ర ప్రభుత్వం జోక్యం చేసుకోవాలనే డిమాండ్ తెరపైకి వచ్చింది.

నెల రోజుల వ్యవధిలో పెరిగిన ధరలు

ధరల విషయానికి వస్తే రిటైల్ ధర సుమారు 25 శాతం, హోల్‌సేల్ ధర 15 శాతం పెరిగింది. ఏడాది క్రితం ఉల్లి రీటైల్ ధర కిలో రూ.20 ఉండగా, హోల్‌సేల్ క్వింటాలకు రూ.1,581.97గా ఉంది. ప్రస్తుతం రిటైల్ ధర కిలో రూ.40 నుంచి రూ.45 మధ్య ఉంది. నెల క్రితం కిలో ధర రూ.20 వరకు ఉంది. నెల రోజుల వ్యవధిలో ఉల్లి ధరలు రెట్టింపయ్యాయి.

కొత్త పంట చేతికి వచ్చే అవకాశాల్లేవు

మరోవైపు సెప్టెంబర్, అక్టోబర్ వరకు కొత్త ఖరీఫ్ పంట చేతికొచ్చే అవకాశం లేకపోవడంతో ఉల్లి కిలో రూ.60 దాటొచ్చని మార్కెట్ విశ్లేషకులు అంటున్నారు. దేశంలో 42 శాతం మేర ఉల్లి ఉత్పత్తి జరిగే మహారాష్ట్రలో తీవ్రమైన కరువు పరిస్థితుల కారణంగా ఈ ఉత్పత్తి 15 నుంచి 20 శాతం తగ్గుదల చవిచూసింది. మహారాష్ట్రలోని 27 జిల్లాలు 20 నుంచి 40 శాతం వరకు లోటు వర్షపాతాన్ని ఎదుర్కొన్నాయని గణాంకాలు సూచిస్తున్నాయి.

✦ ఢిల్లీ ఉత్పత్తి పడిపోయిన క్రమంలో రానున్న రోజుల్లో కిలో ధర రూ.120 నుంచి రూ.150 కి చేరినా ఆశ్చర్యపోనక్కర్లేదని అంటున్నారు. ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాల్లో అవసరమైన అంత ఉత్పత్తి మార్కెట్‌కు రావడం లేదు. దీంతో ధర పైకి ఎగబాకుతోంది. కొత్త పంట మార్కెట్లోకి వచ్చే వరకు మరికొన్ని రోజులు ఉల్లి కొరత కొనసాగుతుందని రైతులు, హోల్‌సేల్ వ్యాపారులు చెబుతున్నారు.

సాగర్ కాల్వలకు మరమ్మతులు చేపట్టండి

ఎమ్మెల్యే చదలవాడను కోరిన సీపీఐ నాయకులు


కలెక్టరేట్ వద్ద ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడకు వినతిపత్రం అందజేస్తున్న సీపీఐ నాయకులు

నరసరావుపేట: నాగార్జునసాగర్ కుడికాలువ పరిధిలోని కాలువల్లో పూడికలు, పిచ్చిచెట్లు, జంగిల్ క్లియరెన్స్, మరమ్మతులు నూతన ప్రభుత్వం వెంటనే చేపట్టాలని సీపీఐ నాయకులు కోరారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్‌కు వచ్చిన ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబుకు వినతిపత్రం సమర్పించారు. కుడికాలువ పరిధిలో పల్నాడు, బాపట్ల, గుంటూరు, ప్రకాశం జిల్లాల పరిధిలో 125 కిలోమీటర్ల పరిధి కలిగి 14 వేల కిలోమీటర్ల పొడవైన బ్రాంచ్, మేజర్, మైనర్ కాలువల ద్వారా 7.5 లక్షల ఎకరాలకు సాగునీరు అందజేస్తుందన్నారు. ఈ నీటి సరఫరా ద్వారా తాగునీరు అందజేయటంతో పాటు విద్యుత్ ఉత్పత్తి, పశువుల కుంటలు ఉన్నాయన్నారు. కాలువలు పూడికతో పేరుకుపోయాయని, నాచు, తూటికాడ, రబ్బరుచెట్లతో నిండిపోయాయన్నారు. దీనివల్ల నీరు వేగంగా కాలువల్లో ప్రవహించక రైతులకు నీరు సక్రమంగా అందట్లేదన్నారు. కావున వెంటనే మరమ్మతులు చేపట్టి కాలువలను బాగుచేయాలని కోరారు. జిల్లా సహాయ కార్యదర్శి కాసా రాంబాబు, పట్టణ కార్యదర్శి వైదన వెంకట్, షేక్ చిన్నజాన్ సైదా, పున్నయ్య పాల్గొన్నారు.

బడిఈడు పిల్లలను పాఠశాలల్లో చేర్పించాలి


విద్యార్థుల నమోదు కార్యక్రమం నిర్వహిస్తున్న స్కూల్ ఇన్‌చార్జి హెచ్‌ఎం శ్రీనివాసరావు

చిలకలూరిపేట: బడిఈడు పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని డాక్టర్ మద్రి చెన్నారెడ్డి మున్సిపల్ ప్రాథమిక పాఠశాల ఇన్‌చార్జి హెచ్‌ఎం పోటు శ్రీనివాసరావు తెలిపారు. పాఠశాల ఆవాస ప్రాంతంలో బడిఈడు పిల్లలను గుర్తించి పాఠశాలలో చేర్పించే విద్యా ప్రవేశం కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు పెంపుకై విద్యార్థుల తల్లిదండ్రుల కమిటీ భాగస్వామ్యం వహించాలని కోరారు. బాల్యంలో చదువుపొందే హక్కు ప్రతి చిన్నారికి ఉందని పేర్కొన్నారు. దానిని పిల్లల తల్లిదండ్రులు హరించకూడదని వెల్లడించారు. ప్రభుత్వ పాఠశాలల్లో పౌష్టికాహారంతో పాటు తల్లికి వందనం ద్వారా నగదు అందజేత, ఆరోగ్య పరిరక్షణకు వైద్య పరీక్షలు, ఇంగ్లిషు మీడియం డిజిటల్ క్లాసులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

పచ్చిరొట్ట ఎరువులు సాగు చేయండి


కార్యక్రమంలో మాట్లాడుతున్న ఏవో రామారావు

ఈపూరు: పచ్చిరొట్ట ఎరువులను సాగు చేసుకోవడం ద్వారా నేల సారాన్ని కాపాడుకోవచ్చని వ్యవసాయ అధికారి రామినీడి రామారావు తెలిపారు. మండలంలోని గుండేపల్లి, వనికుంట గ్రామాల్లో కౌలుదారులకు పంటసాగు హక్కు పత్రం–ఉపయోగాల గురించి సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కౌలుకు సాగు చేసుకునే ప్రతి రైతు తప్పనిసరిగా కౌలురైతు కార్డును పొందాలన్నారు. ఈ కార్డు వలన సాగు చేసిన పంటల నమోదు, అకారణంగా కురిసే వర్షాల వల్ల పంట నష్టపరిహారం, రైతులకు అవసరమైన విత్తనాలు ఆర్‌బీకేల్లో పొందేందుకు ఉపయోగ పడుతుందన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ విస్తరణ అధికారి బి.అప్పారావు, సర్పంచ్‌లు కాసరగడ్డ మల్లికార్జున్, బచ్చనబోయిన వెంకట సుబ్బయ్య, వీఆర్వో నాసర్ సాహెబ్, వీఆర్‌ఏ వెంకటేష్, వీఏఏ ఆనంద్ బాబు, రైతులు పాల్గొన్నారు.

29న దేవదాయ భూమి బహిరంగ వేలంపాట

శావల్యాపురం: మండలంలోని వేల్పూరు గ్రామంలో వేంచేసియున్న శ్రీరామలింగేశ్వర స్వామి దేవస్థానానికి చెందిన 9 ఎకరాల సాగు భూమిని బహిరంగ వేలంపాటను ఈనెల 29న శ్రీప్రసన్న రామలింగేశ్వర, కోదండ రామస్వామి దేవాలయ ప్రాంగణంలో దేవదాయ శాఖ అధికారుల నిర్వహిస్తున్నట్లు దేవదాయ అధికారి పి.వెంకటరెడ్డి సోమవారం తెలిపారు. 2024–24 నుంచి 2026–27 సంవత్సరం మార్చి 31 వరకు కౌలు కాలమితి అన్నారు. బహిరంగ వేలంపాటలో పాల్గొనే వారు దేవస్థానమునకు బకాయి ఉన్నవారు, కోర్టు కేసులున్న వారు, లిటిగేషన్ వ్యక్తులు వేలం పాటలో పాల్గొనరాదన్నారు. స్థిరాస్తి ఉన్నవారు మాత్రమే ఈ వేలం పాటలో పాల్గొనాలన్నారు. వేలంపాటలో పాల్గొనే వారు ధరావత్తు రూ. 1000 రూపాయలు చెల్లించాలన్నారు. ప్రభుత్వ నిబంధనలు మేరకు తుది నిర్ణయం అధికారులదేనని ఆయన వివరించారు. ఉదయం 10 గంటలకు ఈ వేలంపాట ఆరంభం అవుతుందని ఆయన వివరించారు.

కౌలు రైతులకు సీసీఆర్‌సీ కార్డులు ఎంతో ఉపయుక్తం


అనుపాలెం రైతు భరోసా కేంద్రంలో కౌలు రైతులకు అవగాహన సమావేశం

రాజుపాలెం: రుణ అర్హత కార్డులు(సీసీఆర్‌సీ) కౌలు రైతులకు ఎంతగానో ఉపయోగపడతాయని వ్యవసాయాధికారి వెంకటనర్సయ్య తెలిపారు. మండలంలోని అనుపాలెం రైతు భరోసా కేంద్రంలో కౌలు రైతులకు అవగాహన సమావేశం సోమవారం నిర్వహించారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సీసీఆర్‌సీ కార్డులు అందజేస్తామని తెలిపారు. ఈ కార్డులు 11 నెలలు మాత్రమే ఉపయోగపడతాయని తెలిపారు. ఈ కార్డుల ద్వారా పంట నమోదు చేయించుకోవచ్చని, పండిన పంటను వ్యవసాయ మార్కెట్‌ల ద్వారా విక్రయించుకోవచ్చని తెలిపారు. రైతులకు ఇన్సురెన్సు, బ్యాంక్‌ల ద్వారా రుణాలు తీసుకోవచ్చని తెలిపారు. కౌలు చేసే రైతులు ప్రతి ఒక్కరు సీసీఆర్‌సీ కార్డు కోసం దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. పరిశీలించి వెంటనే కార్డులు అందిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో అగ్రికల్చర్ అసిస్టెంట్ వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాలలో ‘నేను బడికి పోతా’ ర్యాలీ


లేమల్లెలో నేను బడికి పోతా ర్యాలీలో విద్యార్థులు, ఉపాధ్యాయులు

అమరావతి: మండల పరిధిలోని గ్రామాలలో బడి బయట ఉన్న పిల్లలను బడిలో చేర్పించటానికి అలాగే ప్రైవేటు స్కూళ్లలో చేర్చకుండా ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించటానికి విద్యా శాఖ ఆధ్వర్యంలో ‘నేను బడికి పోతా’ ర్యాలీలు నిర్వహించారు. ఆయా గ్రామాలలో పాఠశాల విద్యార్థులు, గ్రామస్తులు, తల్లిదండ్రులు ఉపాధ్యాయులు ఈ ర్యాలీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సోమవారం ఎంఈవో–2 సీహెచ్ శివబాబు మాట్లాడుతూ వేసవి సెలవుల అనంతరం ప్రభుత్వ పాఠశాలలు పునఃప్రారంభమైన నేపథ్యంలో విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని విద్యార్థులు, ఉపాధ్యాయులు గ్రామాలలో అవగాహన ర్యాలీలు నిర్వహిస్తున్నారు. అలాగే గ్రామాలలో బడి ఈడు పిల్లలు ఉన్న తల్లిదండ్రులతో ఉపాధ్యాయులు స్వయంగా మాట్లాడి విద్యార్థులకు కల్పిస్తున్న సౌకర్యాలు, పథకాలను వివరించి ప్రభుత్వ పాఠశాలల్లోనే పిల్లలను చేర్పించాలని కోరుతున్నారన్నారు. ఇప్పటికే విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, నోట్‌పుస్తకాలతో కూడిన కిట్స్ పంపిణీ చేశామన్నారు. కిట్‌లో బూట్లు పంపిణీ జరగలేదని అలాగే 7వ తరగతి పుస్తకాలు ఇంకా అందుబాటులోకి రాలేదన్నారు. త్వరలో పంపిణీ చేసే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు.

ఫీజుల దోపిడీ అరికట్టాలి

పిడుగురాళ్ల: పిడుగురాళ్ల పరిసర ప్రాంతాల్లో స్కూల్, కాలేజీల యాజమాన్యాలు అధిక ఫీజులు వసూలు చేస్తున్నాయని దీనిని అరికట్టాలని ఎం సీపీఐ పల్నాడు జిల్లా అధ్యక్షులు ఓర్సు కృష్ణ అన్నారు. పట్టణంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిడుగురాళ్ల పరిసర ప్రాంతాల్లో ఏ పాఠశాల కూడా విద్యా హక్కు చట్టం నియమ నిబంధనలను పాటించటం లేదని తెలియజేశారు.